ప్రజాశక్తి

ఆదివారం 20 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆఖరి వరకూ హైడ్రామా !



మేయర్‌పై అవిశ్వాసంలో నెగ్గిన అనంతరం పీలా శ్రీనివాస్, గంటా ఆలింగనం

◆ తొలుత సంఖ్య తప్పి కూటమికి కన్నులొట్టపోయిన వైనం

◆ చివరి నిమిషంలో గట్టెక్కిన 'అవిశ్వాసం'

◆ మేయర్ పీఠం కైవసం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు 'కూటమి' నేతలకు చివర వరకూ చుక్కలు కనిపించాయని చెప్పక తప్పదు. జివిఎంసి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం, ఓటింగ్ ప్రక్రియ విశాఖ నగర ప్రజలనే కాదు యావత్తు రాష్ట్రాన్నే శనివారం ఉత్కంఠకు గురిచేశాయనడం అతిశయోక్తి కాదు. తుదకు హైడ్రామా నడుమ అవిశ్వాసాన్ని కూటమి నెగ్గింది. ఉదయం 11 గంటల వరకూ.. అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశంలో ఆశీనులయ్యే వరకూ 74 మ్యాజిక్ ఫిగర్‌ను చేరుతామా ? లేదా ? అన్న అనుమానాలతోనే కూటమి నేతలంతా ఉన్నారు. చాలాసేపు టిడిపి నేతలు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్‌ల ముఖాలు వెలవెలబోయాయి. టిడిపికి చెందిన కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, ఉరుకూటి నారాయణరావు ఈ అవిశ్వాస సమావేశానికి డుమ్మాకొట్టడంతో



బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న హేమలత

కార్పొరేట్ శక్తులకు రైల్వేలు

◆ ప్రైవేటీకరణ ఆపండి - భద్రతా ప్రమాణాలు చేపట్టండి

◆ సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత

రైల్వేల ప్రైవేటీకరణ ఆపాలని, భద్రతా ప్రమాణాలు చేపట్టాలని సిఐటియు జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత అన్నారు. రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల సంపదైన రైల్వేను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ పర్స్ కుమార్, వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

నాలుగు వసంతాల మేయర్ పదవి సంతృప్తినిచ్చింది

\- గొలగాని హరి వెంకటకుమారి

▶ వార్త 2లో..

పదికి చేరిన బాణసంచా మృతుల సంఖ్య

▶ వార్త 8లో..

మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

▶ వార్త 5లో..



ప్రణీత్ (ఫైల్‌ఫోటో)

కళాశాల ఎదుట ఆందోళనకు దిగిన విద్యార్థులు

మెడికో ఆత్మహత్య

యాజమాన్యం వేధింపులే కారణం : మృతుని కుటుంబీకులు

వార్త మెయిన్‌లో..

జెఇఇ మెయిన్స్‌లో సత్తా

మెరుగైన ర్యాంకులు సాధించిన విశాఖ, అనకాపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వారిని పలువురు అభినందించారు.

కొమ్మాది : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ (మారికవలస) నుంచి హాజరైన విద్యార్థుల్లో 8 మంది ప్రతిభకనబరిచారు. సంస్థ నుంచి 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ముగ్గురు విద్యార్థులు దేశం లోనే ప్రతిష్టాత్మక ఎన్ఐటి, ఐఐఐటిలలో సీట్లు సాధించే దిశగా ర్యాంకులు తెచ్చుకున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.శివ ప్రసాద్ తెలిపారు. మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ గౌడ్ అభినందించారు.



ఆలిండియా నాలుగో ర్యాంకు సాధించిన పూజిత కృష్ణ



ర్యాంకులు సాధించిన శ్రీ విశ్వ విద్యార్థులు

శ్రీ విశ్వ విద్యార్థుల జయభేరి

ఎంవిపి.కాలనీ : జెఇఇ మెయిన్స్ 2025 ఫలితాల్లో శ్రీ విశ్వ

మొదటి పేజీ తరువాయి..



ర్యాంకులు సాధించిన ఆకాష్ విద్యార్థులు

జెఇఇ మెయిన్స్‌లో సత్తా

జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు విశాఖలోని తమ విద్యాసంస్థకు చెందిన వారు 311, 407, 586, 648, 688 ర్యాంకులు సాధించారని, 100లోపు ఐదుగురు, 5 వేలలోపు 29 మంది, 10 వేలలోపు 47 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారని మొత్తంగా 247 మంది విద్యార్థులు ఎన్ఐటి, ఐఐఐటిలలో సీటు పొందేందుకు ర్యాంకులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.ధర్మరాజు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

అసెంట్‌కు ర్యాంకుల పంట

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో అసెంట్ కళాశాల విశాఖపట్నం విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని సంస్థ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. తమ కళాశాల విద్యార్థి ఎస్.పూజితకృష్ణ జాతీయ స్థాయిలో రిజర్వుడు కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించాడని వెల్లడించారు. అతనితో పాటు వరుసగా 203, 208, 408, 450, 618, 813, 926, 941, 983, 1102, 1322, 1361, 1636, 1702 ర్యాంకులతోపాటు 5000 ర్యాంకులలోపు 31 మంది సాధించారని తెలిపారు. తమ సంస్థ నుంచి ఈ ఏడాది మొత్తంగా 204 మంది విద్యార్థులు అర్హత సాధించారని పేర్కొన్నారు.

సత్తా చాటిన 'ఆకాష్'

సీతమ్మధార : జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విశాఖలోని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. కోతపల్లి నిఖిల్ సాయి, గట్టు శ్రవణ్‌సాయి వరుసగా 99.59, 99.31 శాతం సాధించారని సంస్థ ముఖ్య విద్యా వ్యాపార వ్యవహారాల అధికారి ధీరజ్ కుమార్ మిశ్రా తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. రీజినల్ సేల్స్ హెడ్ నిషాంత్ మిశ్రా, అసిస్టెంట్ డైరెక్టర్ వై.లక్ష్మీనారాయణ, బ్రాంచ్ హెడ్ రాజేష్, ఇతర ఫాకల్టీ సభ్యులు పాల్గొని అభినందించారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

నక్కపల్లి : పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ విద్యార్థులు జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ర్యాంకుల పంట పండించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. కె.సత్య సాయి శ్రీనివాస్ భగవాన్ 77వ ర్యాంక్, డేవిడ్ జాన్సన్ దేవి 2948 ర్యాంక్ సాధించారని, జెఇఇ అడ్వాన్సుడ్‌కు 23 మంది అర్హత సాధించారని వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, ప్రిన్సిపల్ వివిఎస్ఎస్.భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.




విజయ్ ప్రకాష్, సత్యసాయి శ్రీనివాస్ భగవాన్

22న సీనియర్ సిటిజన్లకు ఎంజిటి - 2 కార్యక్రమం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీనియర్ సిటిజన్లకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించే కార్యక్రమాన్ని ఎంజిటి - 2 పేరిట నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ పికె.జోస్ తెలిపారు. శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సహచర నిర్వాహకులు డాక్టర్ కె.రమాప్రభ, ఎస్.వీరభద్రరావులతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో, ఆటపాటలతో సీనియర్ సిటిజన్ల ఆనందోత్సాహాల నడుమ మీట్, గ్రీట్ అండ్ ట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కన్సర్న్ ఛారిటబుల్ ట్రస్ట్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం షడ్రషోపేతమైన శాకాహార భోజనం, సాయంత్రం టీ, కాఫీ అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత ఆటలు, గ్రూపు ఆటలు, నృత్యాలు, పాటలు, మిమిక్రీ, పజిల్స్, మెదడుకు పదును పెట్టే వ్యాయామాలు, కండరాలను మరింత సులభంగా, సమర్థవంతంగా కదిలించేందుకు సహాయపడే వ్యాయామాలు, జ్ఞాపకశక్తి పెంపొందించే వ్యాయామాలు తదితర అంశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ అరగంటకు లక్కీ డిప్ నిర్వహిస్తామని, బహుమతులను పోటీలలో గెలుపొందినవారికి అందజేయనున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు రెండు వందల మంది వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440156638, 9492348428, 9393949345 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆఖరి వరకూ హైడ్రామా !

(మొదటి పేజీ తరువాయి..)

ఒకానొక దశలో తీవ్ర స్థాయిలో కూటమి నేతల్లో కలవరం మొదలైంది. అయితే నాలుగు రోజుల క్రితం జనసేనలో చేరిన వైసిపికి చెందిన 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైసిపి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె, ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక వీరిద్దరూ కూటమికి జై కొట్టడంతో అంతా ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు. వాస్తవానికి తిప్పల వంశీరెడ్డి ఓటింగ్‌కు దూరంగా ఉండాలని భావించినట్టు ప్రచారం జరిగింది. అయితే, అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవ చేసి ఇంటి నుంచి జివిఎంసి కార్యాలయం వరకూ తన కారులో వంశీరెడ్డిని కారులో తీసుకొచ్చారు. ఆఖరుకు అతని ఓటే కూటమికి వరంలా మారిందన్న చర్చ సాగింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పాత మిత్రుడైన ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మధ్యనున్న పాత రాజకీయ బంధం కూడా 'కూటమి'కి ముత్తంశెట్టి కుమార్తె లక్ష్మీ ప్రియాంక రూపంలో చివరి నిమిషంలో ఓటువేసేందుకు దోహదపడిందని చర్చ నడిచింది

అవిశ్వాస తీర్మానం నెగ్గిందిలా..

జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసిలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం జరిగింది. అవిశ్వాసం నెగ్గడానికి 74 మంది అనుకూలంగా చేతులెత్తడంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి (వైసిపి)పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ నేపథ్యంలో టిడిపి ఫ్లోర్ లీడర్‌ను పీలా శ్రీనివాసరావును మేయర్ అభ్యర్థిగా కూటమి నేతలు నేడో, రేపో ఎన్నుకోనున్నారు. వాస్తవానికి జివిఎంసిలో 98 వార్డులకుగానూ 21వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ 2024 ఎన్నికల్లో జనసేన ఎంఎల్‌ఏగా గెలవడంతో ఆ స్థానం ఖాళీ అయి కార్పొరేటర్ స్థానాలు 97కి చేరాయి. జివిఎంసి ఎన్నికల్లో 58 కార్పొరేటర్లను వైసిపి తొలుత గెలుచుకుంది. అయితే, 2024 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో వైసిపి నుంచి ఒక్కొక్కరుగా టిడిపి, జనసేనలోకి జారుకున్నారు. దీంతో విశాఖ మేయర్‌ను దించేయాలని టిడిపి కూటమి కార్పొరేటర్లు నిర్ణయించుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి పదవీ కాలం గడువు సమీపిస్తున్నా అవిశ్వాస తీర్మానానికి కూటమి నేతలు సిద్ధపడ్డారు. గడచిన కొన్ని రోజులుగా కూటమికి చెందిన కార్పొరేటర్లంతా దేశ, విదేశాల్లో పర్యటనలు చేశారు. ప్రత్యేక శిబిరంలోనే 18వ తేదీ వరకూ ఉన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని దసపల్లా హోటల్‌కు చేరుకుని అక్కడి నుంచి ఎసి బస్సులో శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసి కౌన్సిల్ హాలుకు చేరుకున్నారు. కార్పొరేషన్‌లో టిడిపికి 49, వైసిపికి 30, జనసేనకు 14, బిజెపికి 2, సిపిఎం 1, సిపిఐ 1 కార్పొరేటర్లు ఉన్నారు. కూటమి పార్టీలకు 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులున్నారు. వైసిపికి ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులున్నా కార్పొరేటర్లతో సహా వారెవరూ ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి రాలేదు. తొలుత ప్రకటించినట్టుగానే వారంతా సమావేశాన్ని బహిష్కరించారు. తుదకు అవిశ్వాసంపై నెగ్గగానే జివిఎంసి కార్యాలయం బయట కూటమి నేతలంతా బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మొత్తానికి ఎలాగైతేనేమీ జివిఎంసిలో ప్రజా బలంతో గెలిచిన కార్పొరేటర్లు కూటమి పార్టీలకు లేకపోయినా ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడి మేయర్ స్థానాన్ని అవిశ్వాసంతో తన్నుకుపోయారన్న చర్చ నగర వాసుల్లో నడిచింది.



కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి ఎసి బస్సులో వస్తున్న కూటమి కార్పొరేటర్లు



నెగ్గిన అనంతరం విజయోత్సాహంతో వస్తున్న ఎంపీ శ్రీభరత్, కార్పొరేటర్లు



జివిఎంసి ప్రధాన కార్యాలయ సమీపంలో హడావుడి

నాలుగు వసంతాల మేయర్ పదవి సంతృప్తినిచ్చింది

- గొలగాని హరి వెంకటకుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి మేయర్‌గా నాలుగు వసంతాలపాటు నిర్వర్తించిన పదవీ బాధ్యతలు సంతృప్తినిచ్చినట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ నగర ప్రజలకు సేవలను, సంక్షేమ పథకాలను అందించినందుకు, మౌలిక సదుపాయాలను కల్పించినందుకు ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, కార్పొరేటర్లకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి కార్పొరేటర్‌కు సమదృష్టితో నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి పాటుపడ్డానన్నారు. తనపై అవిశ్వాస తీర్మానం పెట్టిన తీరు ఎంతో కలచి వేసిందని, ఆవేదనకు లోనయ్యానని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకుని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు, జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 20న అక్కయ్యపాలెంలోని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగనున్నట్టు పేర్కొన్నారు. పినాకిల్, మ్యాక్సి విజన్ ఐ హాస్పిటల్‌ల వైద్యులతో ఉచిత కంటి, దంత, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సలహాలను కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. కేవలం బ్యాంకు ఖాతాదారులు మాత్రమే కాకుండా అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కమిషనరేట్‌లో రికవరీ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 మార్చి నెల రికవరీ మేళాను శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మీడియాతో మాట్లాడుతూ మార్చి నెలలో 130 కేసులు నమోదయ్యాయని, 85 కేసులను విజయవంతంగా ఛేదించామని, 112 మందిని అరెస్టు చేశామని తెలిపారు. చోరీ కాబడిన సొత్తులో రూ.47,40,793 విలువగల వస్తువులను తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు గ్రామంలోని కెజిబివి పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులకు మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత గట్టమనేని సుభాష్ చంద్రబోస్ శుభాకాంక్షలు తెలిపి వారి ఉన్నత చదువులకు తన వంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని మాట ఇచ్చారు. ప్రిన్సిపల్ ఎస్.సత్యలావణ్య మాట్లాడుతూ, మంచి ఫలితాలు సాధించడానికి కారణమైన ఉపాధ్యాయ సిబ్బందికి, పాఠశాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న బోసుబాబుకు, ఎస్ఎంసి కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. వృక్ష ఫౌండేషన్ అధినేత సురేష్ కుమార్ మాట్లాడుతూ, పిల్లలు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ దేవుడుబాబు, గ్రామ సర్పంచ్ లోడగల రాజేశ్వరిరమణ, ఎస్ఎంసి చైర్మన్ కె.శివాజీ, వైస్ చైర్మన్ ఒ.మంగ, అప్పన్న, యువ నాయకులు బమ్మిడి తారక్, కోరాడ వైకుంఠం, మరుపల్లి జ్ఞానేశ్వర్, బోద్దపు బంగార్రాజు పాల్గొన్నారు.

దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పిఎన్ఎం జివిఎంసి ఉన్నత పాఠశాలలో శనివారం స్థానిక సంగివలస అనిల్ నీరు కొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌కు చెందిన హౌస్ సర్జన్ విద్యార్థులు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 46 మంది విద్యార్థులు దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్య విద్యార్థులు గుర్తించారు. దంత సంరక్షణకు పలు సూచనలు చేశారు. దంత వైద్యులు మోనిష, జి.అనూష, జె.మౌక్తిక తదితరులు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేశారు. ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద, హెచ్ఎం తిరుమలశ్రీదేవి పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన శనివారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 160 మంది 7, 8, 9 తరగతుల బాలికలకు రూ.11 లక్షల విలువ గల సైకిళ్ల పంపిణీ చేశారు. దివీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ సైకిళ్లను అందజేశారు. చిప్పాడ, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, మూలకుద్దు, తూడెం పంచాయతీలకు చెందిన ఆయా జెడ్పీ ఉన్నత పాఠశాలల బాలికలు సైకిళ్లు అందుకున్నారు. ఈ సందర్భంగా దివీస్ సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ, సైకిల్ సౌకర్యాన్ని వినియోగించుకుని క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి చక్కగా చదువుకోవాలని బాలికలకు సూచించారు. జనరల్ మేనేజర్ బాలాజీ, పి అండ్ ఎ అధికారి పి.శ్రీనివాస్, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, మేనేజర్ ఆర్.ప్రసాద్, సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులు, మామిడి పంటకు 26న వేలం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్లశాఖ ఆదేశాల మేరకు విశాఖ కేంద్రకారాగారంలోని డెయిరీఫారంలో ఉన్న 14 పశువులను, మామిడి తోట పంటను ఈ నెల 26వ తేదీన వేలం వేయనున్నట్లు కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన కేంద్రకారాగారం పరేడ్ మైదానంలో ఉదయం 10 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. డిపాజిట్ కింద రూ.1000 జమ చేయాలని, వేలం పాడుకున్న వ్యక్తి డబ్బులను ఒకే దఫా చెల్లించాలని తెలిపారు. డబ్బు చెల్లించకుంటే పాట, డిపాజిట్ రద్దు పరిచి ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందని వివరించారు.

ఆదర్శనీయులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - ఆరిలోవ : సిపిఎం ఆరిలోవ సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి ఆదర్శమూర్తి అని పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. కృష్ణమూర్తి రెండో వర్ధంతి సభను ఆరిలోవ టివిసి పాయింట్ వద్ద జిల్లాకమిటీ సభ్యులు వి. నరేంద్రకుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, కృష్ణమూర్తి 1984లో ఆరిలోవకాలనీ ఏర్పడిన నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆరిలోవలో కొండవాలు, ముడిసర్లోవ ప్రాంతాల ప్రజలకు ఇళ్ల పట్టాలు, మంచినీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులతో పోట్లాడి పేదలకు అండగా నిలిచారన్నారు. విమ్స్ హాస్పటల్ నిర్మాణం, హాస్పటల్లో మెరుగైన ఉచిత వైద్యం అందించాలని సిపిఎం చేసిన అనేక పోరాటాల్లో భాగస్వాములయ్యారని తెలిపారు. పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన భూపోరాటాలలో పాల్గొని నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికే పరిమితం కాకుండా సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం అకౌంటెంట్‌గా బాధ్యతలు నిర్వహించేవారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెను భారాలు వేసే సందర్భంలో ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల



కృష్ణమూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు తదితరులు

సమస్యలు పరిష్కారం కోసం కృషిచేశారన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించి ప్రజలకు అండగా నిలవడమే కృష్ణమూర్తికి మనమిచ్చిన నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి, జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, జోన్ కమిటీ సభ్యులు డి.నాగరాజు, పి.వెంకటరావు, కె.కుమారి, ఎం.చంటి, వి.అన్నపూర్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి : యుటిఎఫ్



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంఇఒ శివరాణి, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ-1 ఎం.శివరాణి శనివారం పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి యుటిఎఫ్ చేస్తున్న కృషిని ఎంఇఒ కొనియాడారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని ఉపాధ్యాయులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించి పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల రవి మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి వసతులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో ప్రవేశం పొంది ఉత్తమ విద్యతో పాటు స్కౌట్, ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ, రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే క్రీడా నైపుణ్యం సాధించవచ్చని చెప్పారు. ఈ నెల 21వ తేదీ నుంచి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభం అవుతున్నాయని, మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలందరూ తమ పిల్లలను ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఎస్.అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ద్వారానే విజయాలను సాధించవచ్చని పలువురు హెచ్‌ఆర్‌లు విద్యార్థులకు స్పష్టం చేశారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం "హెచ్‌ఆర్ సమ్మిట్-2025" పేరిట పలు పారిశ్రామిక సంస్థల హెచ్‌ఆర్‌ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రణాళికతో పాటు ఆలోచించే విధానం, శక్తి సామర్థ్యాలపై విజయం ఆధారపడి ఉంటుందన్నారు. ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలని నొక్కి చెప్పారు. విజయనగరం జెఎన్‌టియు జివి డైరెక్టర్ డాక్టర్ టి.స్వామినాయుడు మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ విజిట్స్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, వర్క్ షాప్‌లు, ప్రాజెక్ట్ వర్క్ వల్ల సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖకు చెందిన కస్టమర్ సక్సెస్, పార్టనర్ ఎంగేజ్ మెంట్ అండ్ ప్రి సేల్స్, అమ్జుర్ టెక్నాలజీస్ అసోసియేట్ డైరెక్టర్ కోడి సునీల్ మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్ ప్రాముఖ్యత గల కోర్సులైన జావా, డాట్ నెట్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌పై నైపుణ్యం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. హైదరాబాద్, మేధా లాంగ్వేజ్ థియేటర్ ఫౌండర్ అండ్ కోచ్ అంబారగొండ చిరంజీవి



సదస్సు ప్రారంభంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

మాట్లాడుతూ, ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు భయాన్ని వీడాలని విద్యార్థులకు సూచించారు. ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలన్నారు. విశాఖపట్నం మౌరి టెక్ అసోసియేట్ ప్రాక్టీస్ లీడ్ సింగంపల్లి వాసు మాట్లాడుతూ, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో వస్తున్న మార్పులను వివరించారు. ఈ సదస్సులో అవంతి ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, రీసెర్చ్ కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ బి.మురళీకృష్ణ, పి.రామకృష్ణ, రాజు, గోవిందరావు, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారులు డాక్టర్ టి.శ్రీనివాసరావు, రూప్ సుందర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన అగ్ని ప్రమాదాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏమి చేయాలో డెమో ద్వారా వివరించారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. కారుషెడ్ సమీపంలోని ఒక స్వీట్ దుకాణంలో పనిచేస్తున్న అశోక్ ఈనెల 17వ తేదీన దుకాణానికి రాలేదు. దుకాణం యజమాని ఇంట్లోనే అశోక్ ఉంటున్నాడు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో యజమాని అనిల్ బిష్ణోయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : గంజాయి రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పాపునాయుడు తెలిపారు. చోడవరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజ్ ఎదురుగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా, ముందస్తు సమాచారం ప్రకారం ఎక్సైజ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ చెందిన మదన్ బాలాజీ, ఎస్ దినేష్ నుండి 3.85 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- మాడుగుల: ఓ వ్యక్తి ఉరి వేసుకొని చనిపోయిన సంఘటన మండలంలోని జాలంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాలంపల్లి గ్రామానికి చెందిన పినబోయిన లోవ (38) మద్యానికి బానిస అయ్యాడు. మద్యం మానేయాలని అతని భార్య లక్ష్మి పలుమార్లు చెప్పింది. ఈ మేరకు ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో గురువారం మాడుగుల పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో, పోలీసులు భార్యా భర్తలిద్దరికి సర్ది చెప్పి పంపించారు. అయినప్పటికీ భర్త మద్యం మానకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్ళి పోయింది. భర్త లోవ శుక్రవారం సాయంత్రం పాక వద్ద ఉరివేసుకొని మృతి చెందాడని ఎస్సై జి.నారాయణరావు తెలిపారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వెంకటేశ్వరరావు తదితరులు

జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు శొంఠ్యాం ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ శ్రీ వెంకట్ విద్యపీఠ్ చైర్మన్ రొంగలి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల రోలుగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఢిల్లీలో జరిగనున్న జాతీయ స్థాయి ఘట్కా పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించడానికి ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ ఏర్పాటుచేసి వివిధ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వెంకటేశ్వరరావు, కోచ్ లెంక అప్పలరాము, టీమ్ మేనేజర్ గవర ఈశ్వరరావు అభినందించారు.

పిహెచ్‌డి ప్రవేశాలకు గీతం ఆన్‌లైన్ పరీక్ష

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పిహెచ్‌డి ప్రవేశ ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు గీతం ప్రాంగణాలలో ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఫార్మసీ, లా, ఆర్కిటెక్చర్, పబ్లిక్ పాలసీ వంటి విభిన్న విభాగాలలో పిహెచ్‌డి ప్రవేశాలకు మే 25న ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు గీతం రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ వి.నందూరి తెలిపారు. ఫార్మసీ విభాగానికి సంబంధించి ప్రత్యేక ప్రవేశ పరీక్ష వేరుగా జూన్ 1న నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేయాలని సూచించారు.


నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పెందుర్తి : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన 97వ వార్డు పరిధి కార్మికనగర్‌లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.వెంకటరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసిందని, అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఆ హామీ అమలుకు నోచలేదని ఆవేదన వ్యక్తంచేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ అమలుచెయ్యాలని, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పెందుర్తి జోన్ కార్యదర్శి అప్పలనాయుడు మాట్లాడుతూ, చట్టం ఆధారంగా అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డులు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఈ సంక్షేమ బోర్డులో రూ.4298 కోట్లు ఉన్నాయని కార్మిక శాఖామంత్రి శాసనమండలికి తెలియజేశారని గుర్తుచేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుచెయ్యటానికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించాల్సిన అవసరంలేదని, సెస్ ద్వారా వచ్చిన నిధులతోనే అమలుచేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, జోన్ నాయకులు బి.మహేష్, ప్రభుదేవా, రాజు, బి.రమణి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఎం.రాంబాబు తదితరులు

ఉచిత గ్యాస్ కోసం ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : ప్రజలందరికీ ఉచిత గ్యాస్ ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యాన ఎస్ఒ ఆఫీసు ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి వస్తే సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ప్రజలందరికీ ఉచిత గ్యాస్ అందడంలేదని చెప్పారు. ఉచిత గ్యాస్ ఇస్తానన్న హామీ నిలబెట్టుకోకుండా సొంత ఇల్లు ఉందని, కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని ఉచిత గ్యాస్ ఎగ్గొట్టడానికి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. రైస్ కార్డు ఉన్న అందరికీ ఉచిత గ్యాస్ ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రేషన్ డిపో ద్వారా బియ్యం, పంచదార, నూనె, కందిపప్పు, చింతపండు, టీ పొడి, రాగులు ఇస్తానని చెప్పినా ఒక్క బియ్యం మాత్రమే అందుతున్నాయని చెప్పారు రేషన్ డిపో ద్వారా 11 రకాల వస్తువులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.లోకేష్, ఎల్.బంగారునాయుడు, కామేశ్వరి, కె.సంతోషం, పి.లక్ష్మణస్వామి, జి.లక్ష్మి, కెపి.కుమార్, కె.కిరీటం పాల్గొన్నారు.

'విశాఖ'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు రెనాల్ట్, నిస్సాన్, ఎక్సెల్ కంపెనీల ఆధ్వర్యాన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెనాల్ట్, నిస్సాన్ కంపెనీలకు ఇంజనీరింగ్ విద్యార్థులు 10 మంది, పాలిటెక్నిక్ విద్యార్థులు 9 మంది అర్హత సాధించారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎక్సెల్ కంపెనీకి పాలిటెక్నిక్ విద్యార్థులు 14 మంది అర్హత సాధించారని, వీరికి వార్షిక వేతనం రూ.2.4 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశం పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ. ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్ అభినందించారు.

పారిశుధ్యాన్ని ప్రయివేటుకు ఇవ్వొద్దు

జ్ఞానాపురం మున్సిపల్ జోనల్ ఆఫీస్ ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులను, మున్సిపల్ పారిశుధ్యాన్ని ప్రయివేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని, మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జ్ఞానాపురంలోని జివిఎంసి జోన్- 5 కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయం చేయడం పట్ల కార్మికులందరూ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రయివేటు ఏజెన్సీల వద్ద కూటమి ప్రభుత్వ నేతలు రూ.వేల కోట్లు కమీషన్లుగా తీసుకొని మున్సిపల్ కార్మికుల బ్రతుకులను కాంట్రాక్టర్లకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు, ప్రజల కన్నా ప్రయివేటు పెట్టుబడిదారులే చంద్రబాబు ప్రభుత్వానికి ఎక్కువైపోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆప్కాస్‌లో ఉన్న పొరపాట్లను సరిచేసి మెరుగైన వ్యవస్థను తీసుకొచ్చినా పర్వాలేదని, లేదా ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్మికులకు సరిపడా పనిముట్లను రెగ్యులర్‌గా ఇవ్వాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికుల పిల్లలకు తక్షణమే ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన వారికి మరో రెండు సంవత్సరాలు పొడిగించాలని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న డెత్, రిటైర్మెంట్, సిక్ పోస్టులను కార్మికుల పిల్లలకు ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ విధానాలను ఆపేవరకూ ఈ పోరాటాన్ని కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు, నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, జోన్ అధ్యక్షులు వి.మహేశ్వరి, నాయకులు వి.సీతాలక్ష్మి, ఎ.అప్పలరాజు, పి.రాజు, ఎం.సత్యవతి, బాలరాజు, అప్పలరాజు, శివ, మణి, ధనలక్ష్మి, నూకరాజు, కొండమ్మ, కనకరాజు, సత్యవతి, కంతల్లి, కేధారి పాల్గొన్నారు.

మావోయిస్టులు, ఆదివాసీల హత్యలను ఆపాలి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఛత్తీస్‌ఘడ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న మావోయిస్టులు, ఆదివాసీల హత్యలను నిలిపివేయాలని సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి డిమాండ్ చేశారు. పౌర హక్కుల నేత ప్రొఫెసర్ కెవి.సుబ్బారావు సంస్మరణ సభ శనివారం పౌర గ్రంథాలయంలో ఎపిసిఎలిసి ఆధ్వర్యాన నిర్వహించారు. సభకు ముఖ్య వక్తగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీలను, పిల్లలు, మహిళలు అని తేడా లేకుండా హత్యచేస్తున్నారని ఆరోపించారు. అడవిలో నివసిస్తూ సాధారణ జీవితాలను గడుపుతున్న అమాయకులైన ఆదివాసీలను మావోయిస్టులుగా చంపుతుండడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పొలాల్లోనూ, కొండల్లోనూ, సారవంతమైన ఖనిజాలు ఉన్నాయని, వీటిని అతి చౌకగా కార్పొరేట్లకు దారాదత్తం చేయడానికే ఈ హత్యలు అని పేర్కొన్నారు. ఈ ఖనిజాలను తవ్వుకునేందుకు అదాని, అంబానీ, వేదాంత్ వంటి కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతిలిచ్చాయని తెలిపారు. వారికి ఇబ్బంది లేకుండా ఉండటానికి ఆదివాసీలను, మావోయిస్టు ఉద్యమాన్ని మార్చి 2026 లోపు అంతం చేయడానికి కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చంపుతోందని ఆరోపించారు. మధ్య భారత దేశంలో రాజ్యాంగంలో ఉన్న 5వ షెడ్యూల్‌ను పెసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ రాజ్యాంగ వ్యతిరేక చర్యలు చేపట్టిందన్నారు. కార్పొరేటీకరణ, కాషాయీకరణ, సైనికీకరణకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ హక్కుల కోసం సుబ్బారావు ఉద్యమించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేడంగి చిట్టిబాబు, సిపిఐ నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిఎల్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, ప్రొఫెసర్ కెపి.సుబ్బారావు సహచరి డి.లలిత తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ కామేశ్వరరావు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -గాజువాక : ఇన్సాస్ మల్టీ కుశన్ రెస్టారెంట్ యజమాని శ్రీనివాసరావు ఆధ్వర్యాన సమతానగర్ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని న్యూపోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు రాకపోకలు సాగించే, నిర్వాసితుల ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలోకాంట్రాక్టర్ ఆకుల అప్పలసూరి, సమతానగర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

ప్రజాశక్తి -గాజువాక : గత నెల 30న ఉద్యోగ విరమణ పొందిన డాక్‌యార్డు ఉద్యోగి శ్రీనివాస్‌చౌదరిని, విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి విఆర్ఎస్ తీసుకున్న బందోపాధ్యాయను తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి అపార్ట్‌మెంట్ వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన సభలో 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవ సంబంధాలు తగ్గి, వ్యాపార సంబంధాలే పెరుగుతున్నాయన్నారు. కొన్ని సంవత్సరాలుపోతే ప్రభుత్వ రంగ సంస్థలు ఉండవని, రిటైర్మెంట్ అన్న పదం కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్ పేరుతో కార్మికులను తొలగించి ప్రైవేట్ ఆస్తులుగా మార్చడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. వ్యవస్థలను బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి ప్రజల్లో స్ఫూర్తి లేకుండా ప్రస్తుత పాలక పార్టీలు చేస్తున్నాయని, ఇలాంటి సమయంలో అందరూ కలిసికట్టుగా ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. శ్రీనివాస్ చౌదరి, బందోపాధ్యాయ సేవలు యూనియన్‌కు అవసరమన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, సిఐటియు ఒక కుటుంబం అన్నారు. అనేక రాష్ట్రాలు దాటి ఇక్కడికి వచ్చిన అందరూ ఐక్యంగా ముందుకు పోతున్నామన్నారు. పదిమంది మంచి కోసం ఉద్యోగ విరమణ పొందిన వీరిద్దరూ భవిష్యత్తులో పనిచేయాలని కోరారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, శ్రీనివాస్ చౌదరి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. బందోపాధ్యాయ క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అన్నారు. తోకడ సమైక్య అపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, అపార్ట్‌మెంట్‌లో వారిద్దరి భాగస్వామ్యం చాలా గొప్పదన్నారు. భవిష్యత్తులో వారు సహాయ సహకారాలు అపార్ట్‌మెంట్‌కు ఉపయోగించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షులు రామన్న అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన సభలో సిఐటియు నాయకులు యు.రామస్వామి, వైటి.దాసు, నేవల్ డాక్‌యార్డు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాజు, మహిళా కమిటీ నాయకులు మణి, పద్మ, రమణి, శాంతి, పాల్గొన్నారు.


సన్మాన సభలో మాట్లాడుతున్న డాక్టర్ బి.గంగారావు

మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మికకర్షక భవనంలో రైతు సంఘం ప్రధాన జిల్లా కార్యదర్శి యం అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో వెంకటేశ్వర్లు మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మిక హక్కులు హరిస్తుందని విమర్శించారు. రైతాంగాన్ని తీవ్రంగా నష్ట పరిచే విధానాలు తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని, కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. దేశంలో రూ.27,400 కోట్లు, రాష్ట్రంలో రూ.2,400 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. వీటిని విడుదల చేయకుండా కూలీలను తీవ్ర ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ మే 20 జరిగే దేశవ్యాప్త సమ్మెను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు సబ్సిడీలు, రైతుల పండించే పంటలు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం, ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, డి.వెంకన్న, నాయకులు కె.భవానీ, యు సత్యవతి, ఇరట నరసింహమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు జి నాయన బాబు, గంటా శ్రీరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

22న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న మంగళవారం ఉదయం 9 గంటలకు అనకాపల్లిలోని ఏడి స్కూల్ బిల్డింగ్, ఫూల్ బాగ్ రోడ్డులో దాదాపు 15 పైగా కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ /ఎం. ఫార్మసీ, నర్సింగ్ / ఏదైనా డిగ్రీ, ఏదైనా బి.టెక్, పి.జి, చదివి, 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు వీనికి అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలు తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 7013342667, 9014770409 ఫోన్ నంబర్స్‌కు సంప్రదించాలని కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registration లో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

వికెపిసిపిఐఆర్ 2041 ప్రణాళికను అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం కాకినాడ పెట్రోకెమికల్, పెట్రోలియం పెట్టుబడి ప్రాంతీయ్య పట్టణ అభివృద్ధి సంస్థ (వికెపిసిపిఐఆర్) 2041 బృహత్తర ప్రణాళికను సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని అమలు చెయ్యాలని వికెపిసిపిఐఆర్ యుడిఏ వైస్ చైర్మన్ కెఎస్ విశ్వనాధన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వికెపిసిపిఆర్ 2041 బృహత్తర ప్రణాళిక అవగాహనా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, రోడ్లు, పోర్టులను కలుపుతూ అభివృద్ధి చర్యలు కోసం కావాల్సిన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్ జాహ్నవి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రామారావు, పిసిపిఐఆర్ ప్రణాళిక అధికారి, అటవీ శాఖ అధికారి శామ్యూల్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ బంగారు వర్తకులు పీలా మోహన్‌రావు తను భార్య పీలా దివ్య తేజ జ్ఞాపకార్థం మెయిన్ రోడ్ షాపు వద్ద శనివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బోడ్డేడ శ్రీనివాసరావు ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా మెయిన్ రోడ్ షాపు వద్ద ప్రతిరోజు 365 రోజులు చలివేంద్రాలు నిర్వహిస్తామన్నారు. డి రవి, ఎస్.చిన్ని, ఎం శంకర్, కే అచ్చినాయుడు, నాగరాజు, ఎస్ నూకరాజు పాల్గొన్నారు.

నేటి నుండి వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జార్జ్ క్లబ్ ఎదురుగా గల "కళ్యాణి అకాడమి ఆఫ్ ఆర్ట్స్"లో ఈనెల 20 నుండి మే30 వరకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు అకాడమీ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతము, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డ్, గిటార్లలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 9959577789 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వుంటాయని,. క్లాసులు పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్స్ అందిస్తామని తెలిపారు.

గోవాడ సుగర్స్ రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పారావు, అప్పలరాజు



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2024-2025 క్రసింగ్ సీజన్‌లో రైతులకు రూ.35 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఇటీవల రూ.5 కోట్లు ఇచ్చారని, మిగిలిన రూ.30కోట్లు చెల్లించాలని కోరారు. జిల్లాలోని తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి, నడిపిస్తామని, గోవాడ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక మరిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి నాయనబాబు, ఎస్.వి.నాయుడు, సాంబశివరావు, నర్సింగరావు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ), ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) ఆధ్వర్యంలో డైట్ కళాశాలకు చెందిన 93 మంది విద్యార్థులు ఏఎంటిజెడ్ (ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోన్) పరిశ్రమను సందర్శించారు. అత్యాధునిక వైద్య పరికరాల తయారీ, పరిశోధన, నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి విధానాలు, పరిశ్రమలో జరుగుతున్న కొత్త ఆవిష్కరణలు గురించి ప్రత్యక్షంగా వారు తెలుసుకున్నారు. విద్యార్థులు పిరమిడ్ (3 డి ప్రింటింగ్ సదుపాయంతో అత్యాధునిక వైద్య పరికరాల రూపకల్పన), ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్, అధునాతన కృత్రిమ అవయవాల రూపకల్పన వంటి విప్లవాత్మక కేంద్రాలను సందర్శించారు. వైద్య పరికరాల రూపకల్పన, తయారీ ప్రక్రియలను, ఉత్పత్తి ప్రమాణాలను, నాణ్యత పరీక్షల ప్రక్రియలను గురించి ఏఎంటి.జెడ్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా డైట్ చైర్మన్ దాడి రత్నకర్ మాట్లాడుతూ ఈ పర్యటన విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన కల్పించడమే కాకుండా, వైద్య పరికరాల తయారీ రంగంలో ఇంజనీరింగ్ కీలక పాత్రను అర్థం చేసుకోవడంలో సహాయపడిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైకుంఠరావు, సీఎస్ఐ కన్వీనర్ డాక్టర్ కే.సుజాత, అధ్యాపకులు యస్. మానస, ఎమ్. షర్మిల పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకంబిక అమ్మవారి పండుగ మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతి ప్రదర్శనలు అలరించాయి. శనివారం నాగేశ్వరరావు కోలాట సంఘం, శ్రీరామ వెంకటేశ్వర్లు, ఆధ్యాత్మిక సేవ సమితి సీతానగరం, సిద్ధి వినాయక వెంకటేశ్వర మూలపేట, వెంకటేశ్వర హరి భజన, సూర్యారావు దిబ్బ పాలెం, డాక్టర్ ఎస్ తిలగవతి, నిర్మల మ్యూజిక్ డాన్స్ అకాడమీ గాజువాక చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. వినకోట బుచ్చిరాజు, బొడ్డేడ మురళి, చెక్కల శ్రీను, కర్రి గోవింద్, పద్మావతి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు గ్లూకోజ్ పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మండలంలోని గోవాడ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు జనసేన ఆధ్వర్యంలో శనివారం టాటా గ్లూకోజు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడవకు నూకరాజు, బండి గోపి, కరణం శేఖరు, నీటి సంఘం డైరెక్టర్ ఏడవక శీను, ధర్మశెట్టి దాలినాయుడు, వేపాడ అప్పారావు, బండి సూరిబాబు, ఏడువాక వెంకటరమణ, మల్రోజ్ భాస్కరు పాల్గొన్నారు


లిటిల్ ఛాంప్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన చిన్నారులు

ఒలింపియాడ్‌లో అయ్యన్న విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కె.కోటపాడు : లిటిల్ ఛాంప్స్ ఒలింపియాడ్, ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోర్సులు, సాట్ (సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్షల్లో స్థానిక అయ్యన్న స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో శనివారం అవార్డ్స్ ప్రధానోత్సవం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ డి.రమేష్ బాబు మాట్లాడుతూ విద్యాభ్యాసంలో ఉత్తమంగా చదివిన వారే పోటీ పరీక్షల్లో నెగ్గి అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తారని తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం లిటిల్ ఛాంప్స్ ఒలింపియాడ్‌లో విజేతలైన నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులు 49మందికి, 6 నుంచి 9వ తరగతికి చెందిన విద్యార్థుల్లో ఐఐటీ, నీట్ కాంపిటీషన్స్‌లో ర్యాంక్ సాధించిన ఐదుగురు, సాట్‌లో ర్యాంక్స్ సాధించిన 5 నుండి 9తరగతులకు చెందిన 16మంది విద్యార్థులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్‌ను తహసీల్దార్ రమేష్ బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి, ఉపాధ్యాయులు పద్మిని, శ్రావణి, మున్ని, స్వాతి, చంద్రకళ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : పౌష్టిక ఆహారంతోనే గర్భిణీలు, పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ సిడిపిఓ లలిత కుమారి ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి పద్మజ, మండల ప్రత్యేక అధికారి కె.రమామణి, తహశీల్దారు బి. చిన్నకృష్ణ, ఎంఈఓ-2 ఎంజె రవీంద్రబాబు, ఎంపిహెచ్ఈఓ స్వర్ణలత, వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి కొండాజీ, సర్పంచులు పడాల వెంకటరమణ, బలిరెడ్డి లక్ష్మి కనకరాజు, బండారు మంగ శ్రీనివాసరావు, అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారము గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్ పూర్ణమా దేవి అన్నారు. శనివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ మంగతాయారు, సూపర్వైజర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజం మరింత అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రేమ సమాజాన్ని దాతల సాయంతో మరింతగా అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ప్రేమ సమాజం సలహా మండలి సభ్యులు పూసర్ల రామారావు తెలిపారు. ప్రేమ సమాజంలో అదనపు భవనం, సోలార్ ఎలక్ట్రిసిటీ ప్లాంటు ఏర్పాటు, సురక్షిత మంచినీటి కేంద్రం, గ్రంథాలయం తదితరాలను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, ఇతర పెద్దలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన చోడవరం ప్రేమ సమాజాన్ని నాటి పెద్దలు వేప భీమశంకరం సొంత నిధులతో ఏర్పాటు చేశారని, నేటికీ ఇది నిరంతరాయంగా వృద్ధులకు, పేదలకు, అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం మేనేజర్ ప్రసాద్ రాజు, వేప రామకృష్ణ, సామాజిక కార్యకర్త డిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రేమ సమాజం సలహా మండలి సభ్యులు రామారావు



బోరు రిగ్గింగ్ పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట, మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రజలకు అవసరమైన చోట తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తామని జెడ్పిటిసి దొండా రాంబాబు తెలిపారు. శనివారం వడ్డాదిలో కుబిరెడ్డి వారి కల్లాల వద్ద తాగునీటి బోరు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డాది మేజర్ పంచాయతీలో ఈ దఫా 15 బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలనీలలోనూ, రైతులకు, పాడి పశువులకు ఉపయోగపడేలా వ్యవసాయ కల్లాలు వద్ద తాగునీటి బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, డిసిసి ఉపాధ్యక్షుడు ఎస్ సత్యనారాయణ, మాల మహానాడు యువజన అధ్యక్షుడు బూసి కోటి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చింతల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఎంజె.పట్నాయక్ ఆ పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో రూ.11వేలు విలువచేసే క్రీడా సామాగ్రిని సమకూర్చారు. వాటిని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపాద రవికి అందజేశారు. అక్టోబర్ నెలలో రూ.8 వేలు, నవంబర్‌లో రూ.3000, ఏప్రిల్‌లో రూ.2000 విలువ చేసే క్రీడా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి రాజు, ఉపాధ్యాయులు కెఆర్ఆర్ కుమార్, గాంధీ, బాషా, అమ్మాజీ, హైమావతి, రమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల పనితీరుపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి మెయిన్ పాఠశాల నుంచి ఐదుగురు, హెచ్‌సి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులకు ప్రభుత్వ శాఖల పనితీరుపై శనివారం అవగాహన కల్పించారు. ఎక్స్‌పోజర్ విజిట్స్ పేరుతో సమీపంలోని పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం -1, పోస్ట్ ఆఫీస్, డీసీసీబీ బ్యాంకు, ఎంఈఓ ఆఫీసులను వారు సందర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల హోదాలు, వారి విధులు, అందిస్తున్న సేవల గురించి వారికి తెలియజేశారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు ఎం.విజయలక్ష్మి, ఎస్.అప్పలస్వామి పాల్గొన్నారు.

సంపును శుభ్రపరిచి సిల్ట్ తరలిస్తాం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ప్రజలకు మంచినీరు అందించే ఎర్రవరం సంపును ప్రతి నెలా శుభ్రపరచి సిల్ట్ తరలిస్తామని మున్సిపల్ ఏఈ గణపతి సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎర్రవరం సంపును శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంపు ద్వారా 5 లక్షల లీటర్లు మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వరహానదిలో సోమిదేవుపల్లి ప్రాంతంలో నిర్మించిన బోర్లు ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. వేసవిలో మంచినీరు సరఫరా చేయడం ఒక యజ్ఞంలా భావిస్తామని చెప్పారు. విద్యుత్ సమస్య ఏర్పడితే మంచినీటి కొరత ఏర్పడుతుందని తెలిపారు. 5 లక్షల లీటర్ల సంపును శుభ్ర పరచి ఆ మురుగునీటిని బైటకు తోడడం కష్టంతో కూడుకున్న చర్యగా చెప్పారు. కనీసం 10 మంది కార్మికులు నాలుగు గంటలు పనిచేసినట్లు చెప్పారు.



నీటి సంపును శుభ్ర పర్చుతున్న దృశ్యం

అటవీ భూముల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అటవీ భూమిలో ఎన్ఆర్ఇజిఎస్ కింద ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రవరం పంచాయతీ పరిధిలోని చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను శనివారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు 8 వారాలుగా వేతనం చెల్లించలేదని,. వెంటనే కూలీలకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఉపాధి కూలీలకు కోటి రూపాయలు వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. మండు టెండలో పని చేస్తున్న కూలీలకు కనీసం టెంట్ సౌకర్యం కూడా కల్పించలేనిదని, గతంలో తట్టా, గునపాం, పార అలవెన్స్‌లు, ప్రయాణ ఛార్జీలు, సమ్మర్ అలవెన్స్, పే స్లిప్‌లు ఇచ్చేవారని, మంచినీరు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించేవారని తెలిపారు. కాని నేడు వాటిని పూర్తిగా ఆపేశారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఉపాధి హామీ శాఖకు మంత్రిగా ఉన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూలీలు వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. నిత్యవసర ధరలు, విద్యుత్, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు వీపరీతంగా పెరిగి పోయాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీల వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.307 కూలీ కొలతలతో సంబంధం చెల్లించాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేసారు . ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



పని ప్రదేశంలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పలు ప్రాంతాల్లో రన్ ఫర్ జీసస్



రోలుగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి-రోలుగుంట : గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని రోలుగుంట మండల ఫాస్టర్ ఫెలోషిప్ ద్వారా మండల కోఆర్డినేటర్ వి.ప్రవీణ్, పెలోషిప్ మండల అధ్యక్షులు ఎన్.యేసురాజు ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఏసు రాజు చర్చి నుండి ప్రారంభించి మండల కేంద్రం రోలుగుంట గ్రామ పురవీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ అంతోనిరాజ్, పాస్టర్ నతానియాల్, టైటస్, యోహాను ఆధ్వర్యంలో శనివారం ఏఎల్.పురం గ్రామంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎల్.పురం సర్పంచ్, అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలందరూ శాంతి సమాధానం, క్షమాపణ గుణం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల కాపరులు, సంఘస్తులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కూడలిలో రన్ ఫర్ జీసస్ పేరిట శనివారం ర్యాలీ నిర్వహించారు.కరుణామయుడు శిలువ మోసిన రోజును స్మరించారు. క్రైస్తవలు ఏసుక్రీస్తును స్తుతిస్తూ బృంద గీతాలాపన నిర్వహించారు. జడ్పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతి మార్గం మానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : రన్ ఫర్ జీసస్ క్రైస్తవ ఐక్య శాంతి ర్యాలీని జివిఎంసి నుంచి ఆర్‌కె.బీచ్ వరకు శనివారం నిర్వహించారు. పెంతుకోస్తు, లూథరన్, బాప్టిస్ట్, రోమన్ క్యాథలిక్ , సిఎం - జెఎసి, పలు క్రైస్తవ మినిస్ట్రీలు, పలు క్రైస్తవ సంఘాల నుంచి సుమారు మూడు వేల మందికి పైగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ ఆరిలోవ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, లవ్ అండ్ కంప్రెషన్ మినిస్ట్రీ డైరెక్టర్ చింతల ఐజక్ మాట్లాడుతూ, ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవ్యానికి దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బిసప్ కెఆర్.సింగ్, పాస్టర్ పాల్ విక్టరీ, పాస్టర్ అరుణ్ పాల్, కె.బాబ్జి, విక్టరీ పాల్ సదరక్, అబ్రహం తెనాలి, ఎంఎ.పాల్, విల్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

వేర్వేరు ప్రాంతాల్లో గిరి నాగులు హల్‌చల్

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో మూడు గిరి నాగు పాములు శనివారం హడలెత్తించాయి. దేవరాపల్లి మండలం మారేపల్లి సమీపంలోని పొలాల్లో రెండు గిరినాగులు సంచరిస్తున్నట్లు రైతులు మూడు రోజుల కిందట గుర్తించారు. ఈ రెండు పాములు శనివారం ఉదయం రైతులు చూస్తుండగానే ఒక పుట్టలోకి చేరాయి. ఇది గమనించిన ప్రజలు వెంటనే ఈస్ట్రెన్ గార్డ్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ వారికి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్నేక్ క్యాచర్స్ అక్కడకు చేరుకొని సుమారు గంటన్న సేపు అతి కష్టం మీద వాటిని పుట్టలో నుంచి బయటకు తీసి పట్టుకుని ఆటనీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అలాగే దేవరాపల్లి శారదానది వద్ద శనివారం ఉదయం గిరినాగు రైతులకు కనిపించడంతో ఆందోళనకు గురై పరుగులు తీశారు. విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక నున్న సబ్బవరపు కళ్లాల్లోకి వచ్చింది. భారీ గిరినాగును చూసిన రైతులు కేకలు వెయ్యడంతో పక్కనే ఉన్న తుప్పల్లోకి వెళ్లి పోయింది. వెంటనే యువకులు ఈస్ట్రెన్ గార్డ్స్ వైల్డ్ లైఫ్ సొసైటీకి చెందిన కృష్ణకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి కళ్లాల్లో ఉన్న పాముని పట్టుకోడానికి ప్రయత్నించగా అది తప్పించుకుని ఆర్ అండ్ బి రోడ్డు మీదకు వచ్చింది. దీంతో జనం అంతా ప్రాణభయంతో పరుగులు తీశారు. వెంటనే అక్కడున్న మాజీ సైనికుడు అల్లు శ్రీనివాసరావు తదితరులు సహకారంతో గిరినాగును కృష్ణ పట్టుకుని ఆటనీ ప్రాంతంలో విడిచి పెట్టాడు. ఈ మధ్య కాలంలో దేవరాపల్లి మండలంలో గిరినాగుల సంచారం అధికమవ్వడంతో ప్రజలు తీవ్రంగా భయపడుతున్నారు. మారేపల్లి దగ్గర మగ, ఆడ పాములు పట్టుబడ్డాయని, దేవరాపల్లి దగ్గర పట్టుబడిన పాము మగ పాము అని, అదే ప్రాంతంలో ఆడ పాము సంచరిస్తుందని, అది కనిపించిన వెంటనే తమకు 8142827808 99853122428 నెంబర్‌కు సమాచారం అందించాలని వారు కోరారు. సొసైటీకి చెందిన మూర్తి, కంటి మహంతి, కృష్ణ ప్రసాదు, ఇషాక్, చోడవరం రేంజర్ రవి వర్మ తదితరులు ఈ పాములను పట్టుకున్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

- బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం- వడ్డాది మార్గంలో లక్ష్మీపురం మిల్క్ సెంటర్ వద్ద వద్ద 40 సంవత్సరాలు నుండి మగసాల పూర్ణమ్మ, మగసాల గోవిందమ్మ తమ పిల్లలతో నివాసం ఉంటూ టీ కొట్టు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంట్ తీగలు కమ్మలకు తగిలి మంటలు చెలరేగి ఆ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాగ్రి, విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు శనివారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాయి అందేలా చూస్తామన్నారు. పక్కా ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ సత్యారావు, జనపరెడ్డి దేముడు పాల్గొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసం నెగ్గడంతో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో టిడిపి నేతలు శనివారం అనకాపల్లిలో సంబరాలు చేసుకున్నారు. అనకాపల్లి గవరపాలెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగి నాయుడు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, ఇతర టిడిపి నాయకులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రేవప్కా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.భీమవరంలో గ్రామంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల కింజరపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్థానిక రైతులతో సమూహ చర్చ నిర్వహించారు. చెరకు, ఇతర పంటలు సాగుపై అవగాహన కల్పించారు. పంటల సాగుపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్ కుమార్, టిఓటి డాక్టర్ కిషోర్, విదార్థులు ప్రసన్న, ప్రశాంతి, హారిక, హేమలత, మమత, పలువురు రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక అగ్ని మాపక అధికారి జివి.సత్యరాజు ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందికి, రోగులకు ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ యస్.విద్యదర్శి, డెంటల్ డాక్టర్ ఆషా, కె.జేసుదాసు, ఎస్. రాజశేఖర్(ఐసీటీసీ), జేడీఏ ఆర్టిడి పిడివి.రత్న కుమార్, ఆసుపత్రి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, లీడింగ్ ఫైర్మన్ కె.ఎల్లాజీ, యం. శ్యామ్‌కుమార్, బి.ఉదయ్‌కుమార్, పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

-పలుచోట్ల స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు



చోడవరంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్

ప్రజాశక్తి-చోడవరం

పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చోడవరం పట్టణంలో ఆమె విస్తృతంగా పర్యటించారు. కొత్తూరు జంక్షన్ నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ-వేస్ట్ కలెక్షన్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పనుల్లో పాలుపంచుకున్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాటిన మొక్కలను పరిశీలించారు. . ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎంపీడీవో ఆంజనేయులు, తహశీల్దార్ రామారావు, ఎంపీపీ గాడి కాసులమ్మ, ఇఒపిఆర్‌డి. మహేష్, ఈవో నారాయణరావు, సీఐ అప్పలరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్వర్ణఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సిబ్బందితో కలిసి జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర, ఈ-వ్యర్థాలపై ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ కార్యాలయ ఎలక్షన్, సి సెక్షన్ సూపరింటెండెంట్లు ఎస్‌విఎస్.నాయుడు, డి.రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సిబ్బందితో కలిసి నిర్వహించారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డిఎస్‌పి వి.విష్ణు స్వరూప్, ఏఒ రామ్‌కుమార్, ఇన్స్పెక్టర్లు లక్ష్మీ, ఎస్.రమేష్, ఎస్సైలు రమణయ్య, సురేష్ బాబు, విశ్వనాథం, గిరి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పి. వివిఎస్.మూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కళాశాలలో చీపురు పట్టి చెత్తను శుభ్రం చేశారు.

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు స్వయంగా చీపుర్లుపట్టి రోడ్లు ఊడ్చారు. సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మీ సూరప్పారావు, ఈవో లవరాజు, వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి, టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ పాల్గొన్నారు.

వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభం

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను సర్పంచి దాడి ఎరుకునాయుడు. పంచాయితీ కార్యదర్శి పి.సురేష్‌బాబు ప్రారంభించారు. దీనిపై అవగాహనకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ. ఏటుకూరు రాజేష్ పాల్గొన్నారు.

యలమంచిలి : ఈ- వేస్ట్ మేనేజిమెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ధర్మవరం గుడి నుండి కూరగాయల బజార్, ఎస్సీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్లు కొండబాబు, మున్సిపల్ మేనేజర్ విజయకుమార్, టిపిఒ శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఏఈ గణపతి సుబ్బారావు, మెప్మా సిఎంఎం పద్మావతి పాల్గొన్నారు.

దేవరాపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో పి.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది కార్యాలయ పరిసరాలతో పాటు, గదులను శుభ్రపరిచారు. డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, రీ సర్వే డిటి గఫూర్, ఆర్ ఐ సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలో ఈ-వ్యర్థాలు సేకరణ పై నియోజకవర్గ ప్రత్యేక అధికారి శచీదేవి, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీవో డి సీతారామరాజు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఈ-వ్యర్థాలు సేకరణ స్టాల్స్ ఏర్పాటు చేసి ర్యాలీ చేపట్టారు. సర్పంచ్ జయ రత్న కుమారి, ఉప సర్పంచ్ రాజు, కూటమి నాయకులు కోసూరి శ్రీను, నానాజీ, అంగన్వాడి టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కె.కోటపాడులో..

మండలంలోని కాగిత గ్రామంలో ఈ - వేస్ట్ సేకరణ పై అవగాహన కల్పించారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక ఆర్డీవో కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో వి.వి.రమణ, తహశీల్దార్ రామారావు పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ నెలలో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించారు.

రోలుగుంట:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిఎస్‌ఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శర్మ, కిరణ్ కుమార్, నాని, నాగజ్యోతి పాల్గొన్నారు.

రావికమతం :స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండలంలో గర్నికం గ్రామ సచివాలయం శనివారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో వెంకన్న బాబు, ఈఓపిఆర్‌డి భానోజీరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకన్న బాబు మాట్లాడారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో తిరుమల బాబు, మండల కేంద్రంలో సచివాలయం వద్ద ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద తిరుమల బాబు మొక్కలు నాటారు. కార్యక్రమంలో, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరసింహరావు, గ్రామ రెవెన్యూ సంఘ అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి పురుషోత్తపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండారు పాత్రుడు, హౌసింగ్ బోర్డ్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షులు గున్నమ్మ, సహాయ కార్యదర్శి పద్మ, సుబ్బారావు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో..


పెందుర్తిలో...

ఆరిలోవ : విమ్స్ పరిసరాలను వైద్యులు, సిబ్బంది శుభ్రం చేసారు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

గాజువాక : ఈ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా 67వ వార్డు పరిధిలో ఈ వ్యర్థాల సేకరణను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి రీసైకిలింగ్ చేయాలని భావిస్తోందని తెలిపారు. జివిఎంసి సిఎంఒ నరేష్‌కుమార్, ఎంహెచ్ఒ డాక్టర్ కిరణ్, జోనల్ కమిషనర్ శేషాద్రి, ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గొట్టేటి రవి, భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ములగాడ: మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని శాఖా గ్రంథాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకం వాలంటీర్లు, స్థానిక పెద్దలు గ్రంథాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రతిజ్ఞను జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి చేయించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో అధ్యాపకులు డి.మను ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులను చైతన్యపరిచారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి, ఇతర ప్రోగ్రాం అధికారులు అంజలీదేవి, నదియా, సంధ్య, సిస్టర్ సుగంధి పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సర్పంచ్ జివి.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు పాల్గొన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేసిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని వెల్లంకి పంచాయతీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటిని శాస్త్రీయంగా తొలగించడంపై అవగాహన కల్పించారు. ఈ వ్యర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి పేర్కొన్నారు. సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఎంపిటిసి సభ్యులు పడాల అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి భూపతి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అవగాహన కల్పించాలని డ్వామా పిడి శచీదేవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం వెలుగు సిబ్బందితో సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యే విధంగా అన్ని విధాలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మహిళ జీవనోపాధికి రుణం తీసుకొని, సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. వెలుగు సిబ్బంది మహిళలకు వ్యాపార రంగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ శచీదేవి


సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు

పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం

ప్రజాశక్తి- మాడుగుల:పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం సమకూరుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగుల విశాఖడెయిరీ పాలకేంద్రంలో స్థానిక ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గర్భవతులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ చైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండురు దేవుడు,టౌన్ అధ్యక్షులు రంజిత్ వర్మ, కూటమి నాయకులు కార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.


పుస్తకాలు ఇస్తున్న ముర్రు ముత్యాలనాయుడు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి-చీడికాడ:విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విజ్ఞానం ఎంతో అవసరమని, ఆ విజ్ఞానం పొందాలంటే ప్రతి ఒక్కరు కూడా గ్రంథాలయంలో విలువైన పుస్తకములను చదవాలని మాజీ వైస్ ఛాన్సర్ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు సూచించారు. స్థానిక కేంద్ర శాఖా గ్రంథాలయమునకు కాంపిటీటివ్ పుస్తకాలు, డిక్షనరీ, టెక్ట్స్ పుస్తకాలు, పురాణగ్రంథాలతో పాటు, పర్సనాలిటీ డెవలప్మెంట్ పుస్తకాలు ఆయన అందజేశారు విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ముత్యాలనాయుడు సూచించారు. అనంతరం గ్రంథాలయంలో ఈ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా లైబ్రేరియన్ ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛత శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు.


మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -రావికమతం: హరితహారంలో భాగంగా తహశీల్దార్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో వెంకన్న బాబు, తహసీల్దార్ బి వెంకటరమణ, పలువురు వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకన్న బాబు మాట్లాడుతూ, హరితహారంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు వద్దే కాకుండా గ్రామాలలో కూడా పచ్చని వాతావరణానికి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. చెట్లు ద్వారా వచ్చే ఫల సాయం వస్తుందని, కాలుష్య నివారణకు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

-ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- మాడుగుల:గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. శనివారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఎంపిపి తాళ్లపరెడ్డి రాజారామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా పనిచేస్తూ గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. సమస్యలు పరిష్కరించినప్పుడే తగిన గుర్తింపు వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ వేసవి తొలకరి వర్షాల కారణంగా మారుమూరు గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయని, ఆ దిశగా వైద్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షించి రోగులకు మందులు అందించాలని కోరారు. మండలంలోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక అంబులెన్స్ మాడుగుల పిహెచ్సిలో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, పంచాయతీరాజ్ ఏఈఈ భరణి, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కే రమాదేవి, జడ్పిటిసి కిముడు రవణమ్మ, వైస్ ఎంపిపి కొత్తపల్లి శ్రీనివాసరావు ఎంపిటీసీలు, సర్పంచులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు



వివాహాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

బాల్య వివాహాలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఐసిడిఎస్, శక్తి బృందాలు, మహిళా పోలీసుల సమన్వయంతో నాలుగు బాల్య వివాహాలను మండలంలో అడ్డుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు నర్సీపట్నం మండలం గురందొరపాలెంలో రెండు, చెట్టుపల్లిలో ఒకటి, నర్సీపట్నం అయ్యన్నకాలనీలో మరొక బాల్యవివాహాన్ని అడ్డుకున్నట్లు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.



పరిశీలిస్తున్న అధికారులు

గ్రానైట్ క్వారీలో తనిఖీలు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని కొమిర సమీపంలో గ్రానైట్ క్వారీలో ఉపయోగించే పేలుడు పదార్థాలను తహసిల్దార్ బి.వెంకటరమణ, ఎస్ఐ రఘువర్మ, ఈవోపీఆర్డి బానోజీరావు, పంచాయతీరాజ్ ఏ.ఈ ఉమా శంకర్ అగ్నిమాపక ప్రతినిధి గంగరాజు, ఆర్ఐ సతీష శనివారం తనిఖీలు నిర్వహించారు. క్వారీల నిర్వహణలో జాగ్రత్తలు, తీసుకోవాలని, లేని పక్షంలో క్వారీ యజమానులపై చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న అధికారులు

కొలిక్కిరాని సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయంలో మండల కోఆర్డినేషన్ కమిటీ ద్వారా సమస్యల పరిష్కారానికి అందిన 10 ఫిర్యాదులపై శనివారం తహసిల్దార్ కార్యాలయంలో చర్చలు జరిపారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, స్థానిక తహసిల్దారు తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాధరావు, స్థానిక ఎస్సై రమేష్ ఫిర్యాదు దారులతో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఏ ఒక్క సమస్యకు పరిష్కారం రాలేదు. పొందూరు, కోటవురట్ల,పీకే పల్లి, జగ్గంపేట, జల్లూరు, కొడవటిపూడి రెంయి ఒక్కొక్క ఫిర్యాదు అందగా రాజుపేట, తంగేడు నుంచి రెండు చొప్పున అందాయి. కోటవురట్ల, పొందూరుకు సంబంధించి సమస్యపై కోర్టును ఆశ్రయించాలని కమిటీ సభ్యులు ఫిర్యాదుదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

కీర్తిలాల్‌లో అక్షయ తృతీయ ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:దేశంలోని ప్రముఖ వజ్రాల ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన కీర్తిలాల్స్ ఈ అక్షయ తృతీయ సందర్భంగా కొత్త ఆఫర్లతో ముందుకొచ్చింది. సంపత్ వినాయక ఆలయం సమీపంలోని వైజాగ్ షోరూమ్లో అద్భుతమైన వజ్రాల ఆభరణాలపై క్యారెట్ కు రూ. 20,000 తగ్గింపు అందిస్తున్నామని కీర్తిలాల్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్, సూరజ్ శాంతకుమార్ తెలిపారు. సహజ వజ్రాల సేకరణలపై సాటిలేని పొదుపులను అందించేందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. ప్రతి ఆభరణంతో నాణ్యత, హస్తకళ, విలువను అందించాలన్నదే లక్ష్యమన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : గ్రామ పంచాయతీ ల్లో కార్మికులుగా ఏళ్ల తరబడి నుండి పని చేస్తున్నా కనీస వేతనాలు, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు కాలేదని సీఐటీయూ నాయకుడు ఎస్వీ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనిచేస్తున్న కార్మికులకు ఆరోగ్యం బాగోలేక డ్యూటీ కి సెలవు పెడితే పంచాయతీ వర్కర్స్ కు ఇచ్చే జీతంలో కోత విధిస్తున్నారన్నారు.ఈ మేరకు పారిశుద్ధ్య కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో విజయలక్ష్మికి, ఈవో పీఆర్డి విజయలక్ష్మికి అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నుంచి ఎనిమిది నెలలు బకాయిలు చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ వంటివి అమలు చేయాలని, రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ భీమవరం, రాజాం, అప్పన్నపాలెం, మల్లం, చిట్టి య్యపాలెం, పెదపూడి పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు..



సమస్యలు తెలుపుతున్న సిఐటియు నేతలు

పదికి చేరిన బాణసంచా మృతుల సంఖ్య

ప్రజాశక్తి -కోటవురట్ల:ఈనెల 13న కైలాసపట్నం గ్రామంలో జరిగిన బాణాచించా పేలుళ్ల ఘటనలో మృతుల సంఖ్య పదికి చేరింది. తీవ్ర గాయాలతో మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్ మేనేజర్ మడగల జానకిరామ్(50) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య పదికి చేరింది.

ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

ఈ పేలుళ్ల ఘటనలో ఇది వరకే ఫైర్ వర్క్స్ మేనేజర్ మామ సేనాపతి బాబురావు, చిన్నల్లుడు ఫైర్ వర్క్స్ యజమాని అప్పికొండ తాతబాబు మృతి చెందారు. శనివారం మడగల జానకిరాం మృతితో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి, జరిగిన ప్రమాదంలో ఇద్దరు అల్లుళ్ళు, ఒకరు యజమాని కాగా మరొకరు మేనేజర్ కావడంతో ఇద్దరికీ కూడా ప్రభుత్వం నుంచి ఇచ్చే ఎక్స్గ్రేషియా నిలిపివేశారు. మృతుడు జానకిరాముకు శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.



జానకిరామ్(ఫైల్)



కార్డులు ఇస్తున్న నాయకులు

సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల గ్రామంలో టిడిపి నేత, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ ఆధ్వర్యంలో శనివారం టిడిపి సభ్యత్వ కార్డులను టిడిపి కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా రమణ, టిడిపి కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలికల కాలేజీలో కళావేదిక ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

ప్రజాశక్తి.- విశాఖ కలెక్టరేట్:డాబా గార్డెన్స్ జైల్‌రోడ్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయటం జరుగుతుందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శ్రీ వైశ్యరాజు జ్యూయలర్స్ సిఎస్ఆర్ నిధులతో జూనియర్ కళాశాలలో నిర్మించిన కళావేధిక, హ్యాండ్ వాష్ బేసిన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ వైశ్యరాజు జ్యూయలర్స్ సేవా దృక్పథంతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం హర్షించదగిన విషయం అన్నారు. ఈ కళాశాలలో కనీస సదుపాయాలతో పాటు, మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దక్షిణ నియోజకవర్గంలో మరిన్ని పనులకు సిఎస్ఆర్ ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన టాపర్లకు ఎమ్మెల్యే చేతులమీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ, ఇంటర్ విద్యా జిల్లా అధికారి రాధ, శ్రీ వైశ్యరాజు జ్యూయలర్స్ స్థాపకులు, చైర్మన్ వైశ్యరాజు పాల్గుణ రాజు, ఆయన కుమారులు శ్రీ వైశ్యరాజు గిరి,నరేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం

- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు భాగంగా అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను మూడు విడుతల వారీగా ఉచితంగా పంపిణి చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లాలో మొదటి విడతలో సుమారు 3,71,481 లబ్దిదారులకు గాను రూ.36,48,156 బ్యాంకు అకౌంట్‌లో నేరుగా జమ చేయడమైనదని తెలిపారు. రెండవ విడత పంపిణీ కుడా ఏప్రిల్ నుండి మొదలు కాగా నేటివరకు 40,132 లబ్దిదారులకు సబ్సిడీ మొత్తము రిలీజ్ చేయగా 26,651 లబ్దిదారుల బ్యాంకు అకౌంట్‌లో రూ. 2,11,06,884 జమ చేయబడినట్లు తెలిపారు. మిగిలిన లబ్దిదారులకు త్వరలో జమ చేస్తామని, లబ్దిదారులందరూ ఎటువంటి ఆందోళనకు గురి కావద్దన్నారు.గ్యాస్ ఏజన్సీలు ఎటువంటి అవకతవ కలకు పాల్పడకూడదన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సాయిబాబా ఆలయ నిర్మాణంకు గొల్లవిల్లి రామారావు, రత్నం కుమారులు గణేష్, రమేష్ కుటుంబ సభ్యులు రూ 20 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పడాల అప్పలనాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న దాతలు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పెదబయలు:మండలంలోని అడుగుల పుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామంలో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. తాగడానికి కూడా మంచినీరు దొరకక గ్రామస్తులు దగ్గర్లో ఉన్న పెద్ద గడ్డ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా 9 లక్షలు మంజూరు చేసిందని బోరు తీసి పనులు నిలిపివేశారన్నారు.గ్రామంలో అధిక సంఖ్య మంది వెనుకబడిన పివిటిజీ తెగలవారు కావడంతో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ ఇల్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఇల్లు నిర్మాణానికి నీరు దొరకక లేదన్నారు.